www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 5 మార్చి 2025
5
పశ్చిమ గోదావరి

కొనసాగిన ఇంటర్ పరీక్షలు
19,711 మంది విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలకు మంగళవారం 19,711 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ గ్రూపుకు చెందిన 2,226 మంది, జనరల్ విద్యార్థులు 18,315 మంది మొత్తం 20,541 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 19,711 మంది హాజరయ్యారు. సుమారు 829 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 96 శాతం హాజరు నమోదైంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష కొనసాగినట్లు డిఐఇఒ ఎ.నాగేశ్వరరావు తెలిపారు.

పట్టభద్రుల పట్టం రాజశేఖరంకే


టిడిపి నేతలతో కలిసి పేరాబత్తుల రాజశేఖరం విజయ దరహాసం

- తొలి ప్రాధాన్యతా ఓటుతోనే విజయం
- దాదాపు 30 గంటలు సాగిన ఓట్ల లెక్కింపు
- పిడిఎఫ్ అభ్యర్థిపై 77,461 ఓట్ల మెజార్టీతో గెలుపు
- మొత్తం ఓట్లలో తేడా, చెల్లని ఓట్లు 19,789
- ఫలించిన టిడిపి, కూటమి శ్రేణుల శ్రమ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించారు. తొలి ప్రాధాన్యత ఓటుతోనే విజయం సొంతం చేసుకున్నారు. ప్రత్యర్థి పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుపై 77,461 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపుతో కూటమి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. జనవరి 29న ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి మూడో తేదీన నోటిఫికేషన్ విడుదల చేయడంతో నామినేషన్ల స్వీకరణ మొదలైంది. 13న విత్‌డ్రా పర్వంతో నామినేషన్ల ప్రక్రియ ముగియగా 35 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఫిబ్రవరి 27న ఎన్నికల పోలింగ్ జరగ్గా మొత్తం 3,14,984 ఓట్లకుగాను 2,18,902 ఓట్లు పోలయ్యాయి. ఉమ్మడి గోదావరి జిల్లాల పరిధిలోని బ్యాలెట్ బాక్సులను ఏలూరు సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచారు. ఈ నెల మూడో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. దాదాపు 12 గంటలపాటు ఓట్ల కట్టలు కట్టడమే సరిపోయింది. దాదాపు 16 గంటలకు రాత్రి 11.45 గంటలకు తొలి రౌండ్ ఫలితాలు వెల్లడించారు. 28 టేబుళ్లు ఏర్పాటు చేసి టేబుల్‌కు వెయ్యి ఓట్ల చొప్పున ఎనిమిది రౌండ్లుగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగించి. ప్రతి రౌండ్ ఫలితం దాదాపు రెండు నుంచి మూడు గంటల వరకూ పట్టింది. దాదాపు 30 గంటల తర్వాత నాలుగో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. తొలి ప్రాధాన్యత ఓటును లెక్కిస్తూ, చెల్లని ఓట్లను పక్కన పెడుతూ కౌంటింగ్ ప్రక్రియ సాగించి.

తొలి ప్రాధాన్యత ఓట్లతోనే టిడిపి అభ్యర్థి గెలుపు

ఎంఎల్‌సి ఎన్నికల్లో పోస్టల్ ఓట్లతో కలిపి మొత్తం 2,18,997 ఓట్లు పోలైనట్లు అధికారులు తేల్చారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టగా 19,789 ఓట్లు చెల్లనివి తేలాయి. చెల్లుబాటు ఓట్లు 1,99,208గా తేల్చారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో గెలుపు సాధించాలంటే 99,604 ఓట్లు రావాల్సి ఉండగా టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొత్తం 1,24,702 ఓట్లు వచ్చాయి. ప్రతి రౌండ్‌లోనూ 15 వేలకు పైగా ఓట్లు సాధిస్తూ టిడిపి అభ్యర్థి పైచేయి సాధిస్తూ ముందుకెళ్లారు. మొత్తం ఎనిమిది రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ జరగ్గా ఏడో రౌండ్‌లోనే టిడిపి అభ్యర్థి గెలుపునకు సంబంధించిన మ్యాజిక్ ఫిగర్‌ను దాటేశారు. పిడిఎఫ్ అభ్యర్థికి ఈ ఎన్నికల్లో మొత్తం 47,241 ఓట్లు వచ్చాయి. మూడో స్థానంలో మాజీ ఎంపీ హర్షకుమార్ కుమారుడు జివి.సుందర్‌కు 16,183 ఓట్లు వచ్చాయి. విజయం సాధించిన టిడిపి అభ్యర్థికి జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి ధ్రువీకరణపత్రం అందించారు. ఎన్నికల్లో గెలుపొందిన పేరాబత్తుల రాజశేఖరానికి సమీప ప్రత్యర్థి దిడ్ల వీర రాఘవులు అభినందనలు తెలిపారు.

కౌంటింగ్ ఆలస్యంపై సర్వత్రా అసహనం

ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ వేగంగా జరగలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. పక్కన కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ఫలితం మూడో తేదీ రాత్రికే స్పష్టత రాగా, ఇక్కడ మాత్రం నాలుగోతేదీ మధ్యాహ్నం రెండుగంటల వరకూ సాగింది. సరైన ప్రణాళిక లేకుండా కౌంటింగ్ ప్రక్రియ చేపట్టారనే చర్చ సర్వత్రా సాగింది. సిబ్బంది మూడు షిఫ్టులుగా లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్నారు. భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణపత్రం అందుకుంటున్న రాజశేఖరం

ఓట్ల లెక్కింపులో సిబ్బంది


రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్విని కలిసిన టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థులు పేరాబత్తుల రాజశేఖరం, దిడ్ల వీర రాఘవులు మాటామంతీ

ఓటింగ్ ప్రక్రియపై అవగాహనలో అధికారులు విఫలం

ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓట్లు వేసే అంకెలపై అధికారులకు, ఏజెంట్లకు మధ్య మూడో తేదీ రాత్రి వాగ్వాదం చోటుచేసుకుంది. నిబంధనల ప్రకారం అభ్యర్థి పేరు ముందు బాక్సుల్లో ఒకటి మాత్రమే వేయాలని, రోమన్ అంకెలు వేయకూడదని, అలా వేస్తే చెల్లదని చెబుతూ వచ్చారు. కాని కౌంటింగ్ ప్రక్రియలో మాత్రం రోమన్ అంకె ఒకటి వేసినా చెల్లుబాటు అవుతుందని తేల్చారు. అదేవిధంగా ఒకటి అంకె తప్పు గడిలో మరేమీ వేయకూడదని ప్రచారంలో అభ్యర్థులు సైతం ఓటర్లకు తెలిపారు. ఒకటికి ముందు జీరో వేసినా ఓటు చెల్లుబాటు అవుతుందని కౌంటింగ్‌లో అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా ఒకటి వేసి ఒకటి చుట్టూ సున్నా చుట్టినా ఓట్లు చెల్లుబాటు అవుతాయని చెప్పడంతో పలువురు అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు అభ్యంతరం తెలిపారు. ఎన్నికల ముందు అభ్యర్థులతో జరిగిన సమావేశాల్లో ఓటింగ్ ప్రక్రియపై అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడం వల్లే ఇది జరిగిందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల నిబంధనావళి బుక్‌లో ఉన్నట్లు అధికారులు చెప్పడం విశేషం.

ఓట్లలో తేడా.. చెల్లని ఓట్లు 19,789

ఫిబ్రవరి 27వ తేదీన ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ జరిగింది. అధికారులు ఇచ్చిన లెక్కల ప్రకారం మొత్తం 2,18,902 ఓట్లు పోలవగా 69.50 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. పోస్టల్ ఓట్లు 243 కలుపుకుంటే మొత్తం 2,19,145గా ఉండాలి. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యాక అధికారులు ఇచ్చిన లెక్కలు చూస్తే మొత్తం ఓట్లు 2,18,997గా పేర్కొన్నారు. పోలింగ్ రోజు ఇచ్చిన లెక్కలకు, కౌంటింగ్ పూర్తయ్యాక ఇచ్చిన లెక్కలకు 148 ఓట్లు తగ్గాయి. దీనికి సంబంధించి అధికారులు ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు. దీంతో గతంలో ఇచ్చిన లెక్కలు, ప్రస్తుతం ఇచ్చిన లెక్కలపై అంతటా అయోమయం నెలకొంది. పట్టభద్రులు ఎన్నికల్లో సైతం చెల్లని ఓట్లు భారీగా నమోదవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఏకంగా 19,789 ఓట్లు చెల్లనివిగా తేలాయి. ఎక్కువ మంది అంకెలు వేయకుండా టిక్కులు పెట్టడం వల్ల చెల్లని ఓట్లుగా మిగిలిపోయాయి. పోస్టల్ ఓట్లు 243 పోలవగా, అందులో చెల్లని ఓట్లు 42గా ఉన్నాయి. చదువుకున్న వారుసైతం ఓటు సరిగా వేయకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ప్రధాన అభ్యర్థులు	వచ్చిన ఓట్లు
పేరాబత్తుల రాజశేఖరం	1,24,702
దిడ్ల వీరరాఘవులు	47,241
జివి.సుందర్	16,183
చెల్లని ఓట్లు	19,789

గెలుపోటములకు కారణాలపై చర్చ

ఈ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థికి గెలుపునకు ప్రధాన కారణాలు అనేకం ఉన్నాయి. ముందుగా అభ్యర్థిని ప్రకటించడం కలిసొచ్చింది. అంతేకాకుండా ఓటర్ల చేర్పులో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ నుంచి మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌ఎలు, గ్రామస్థాయి నాయకులు వరకూ పెద్దఎత్తున ప్రచారం నిర్వహించడం. 30 మంది ఓటర్లకు ఒక టీమ్‌ను ఏర్పాటు చేయడం, సోషల్ మీడియా, టెక్నాలజీని బాగా వినియోగించుకోవడం, ఓటర్లను పోలింగ్ బూత్‌లకు రప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరచడం. ఆర్థిక బలం ఇలా అనేక అంశాలు టిడిపి అభ్యర్థి గెలుపునకు ప్రధాన కారణమయ్యాయి.

కూటమిపై నమ్మకమే గెలుపునకు కారణం
పేరాబత్తుల రాజశేఖరం

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకమే ఈ గెలుపునకు కారణం. ఎన్నికల రోజు లోకేష్ నిరంతరం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ ముందుకు నడిపించారు. అందరినీ ఏకతాటిపైకి తెచ్చి గెలుపునకు లోకేష్ ఎనలేని కృషి చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలవడం ఆనందంగా ఉంది. పట్టభద్రులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. నా గెలుపునకు కృషి చేసిన నేతలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు
దిడ్ల వీరరాఘవులు, పిడిఎఫ్ అభ్యర్థి

ఎంఎల్‌సి అభ్యర్థిగా నామినేషన్ ఘట్టం నుంచి చివరి వరకూ నాకు మద్దతు తెలిపి ఓటేసిన పట్టభద్రులకు, నా ప్రచారంలో పాల్గొని సహకరించిన శ్రేణులకు అందరికీ కృతజ్ఞతలు. భవిష్యత్తులోనూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, మహిళల, యువత పక్షాన పోరాటం కొనసాగుతోంది.

సబ్సిడీ రుణాలకు లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలి
కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఎస్‌సి, బిసి కార్పొరేషన్ల ద్వారా వివిధ సబ్సిడీ రుణాల మంజూరుకు లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ఆమె ఆయా కార్పొరేషన్ల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఎస్‌సి, బిసి కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులను గుర్తించి నియోజకవర్గాలవారీగా జాబితాలను సిద్ధం చేయాలన్నారు. రుణాలన్నీ మార్చి 31లోపు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌సి మహిళలకు ఉన్నతి పథకం కింద బ్యాంకు కన్సెంట్ లేకుండా 120 యూనిట్లు మంజూరుకు రూ.3.60 కోట్లు ఇవ్వొచ్చని, వీటితో పాసింజర్ ఆటోలను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఎస్‌సి జనరల్ కేటగిరీలో 714 యూనిట్లకు రూ.24.39 కోట్లు మంజూరు చేయగా, సరుకుల రవాణా వాహనాల కొనుగోలుకు ఒక్కొక్క యూనిట్‌కు రూ.3 లక్షల వరకు మంజూరు చేయవచ్చని, టైప్-1 కేటగిరిలో 50 శాతం సబ్సిడీ, టైప్-2 కేటగిరిలో 40 శాతం సబ్సిడీ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు యూనిట్లు నెలకొల్పేందుకు 60 శాతం సబ్సిడీ, ఐఎస్‌బి యూనిట్లకు టైప్-1కు 60 శాతం, టైపు-2కి 40 శాతం సబ్సిడీ, వ్యవసాయ పరికరాల కొనుగోలుకు 50 శాతం సబ్సిడీపై రుణాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. బిసిలకు స్వయం ఉపాధి సోపానం కింద 1,901 యూనిట్లు నెలకొల్పేందుకు రూ.36.50 కోట్లు మంజూరు చేయగా, రూ.2 లక్షల రుణానికి రూ.75 వేలు లేదా 50 శాతం సబ్సిడీ ఏది తక్కువైతే అది, రూ.3 లక్షల రుణాలకు రూ.1.25 లక్షలు లేదా 50 శాతం సబ్సిడీ ఏది తక్కువైతే అది, రూ.5 లక్షల రుణాలకు రూ.2 లక్షలు లేదా 50 శాతం సబ్సిడీతో రుణాలను మంజూరు చేస్తారన్నారు. 39 జనరిక్ మెడికల్ షాపులు నెలకొల్పేందుకు రూ.3.12 కోట్లు మంజూరు చేయగా, ఒక్కో యూనిట్‌కు 50 శాతం సబ్సిడీని అందజేస్తున్నట్లు తెలిపారు. ఇడబ్ల్యుఎస్ తరగతులకు స్వయం ఉపాధి సోపానం కింద 215 యూనిట్లు నెలకొల్పేందుకు రూ.4.30 కోట్లు మంజూరు చేయగా, ప్రతి యూనిట్‌కు 50 శాతం సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. 35 జనరిక్ మెడికల్ షాపులు నెలకొల్పేందుకు రూ.2.28 కోట్లు మంజూరు చేయగా, ఒక్కొక్క యూనిట్ కు 50 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా చంద్రన్న సోపానం కింద 694 యూనిట్లు నెలకొల్పేందుకు రూ.23.31 కోట్లు మజూరు చేయగా ఒక్కొక్క యూనిట్‌కు 50 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు 10 యూనిట్లు నెలకొల్పేందుకు రూ.25 కోట్లు మంజూరు చేయగా వీటిని మూడు నుండి ఐదుగురు సభ్యులు కలిగిన గ్రూపులకు మంజూరు చేస్తారన్నారు. ఒక్కొక్క యూనిట్‌కు రూ.25 లక్షలు మంజూరు చేస్తారని, దీనిలో 40 శాతం సబ్సిడీ, 40 శాతం టర్మ్ లోన్, 20 శాతం లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రుణాల మంజూరుకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుందని, త్వరలో వెబ్‌సైట్ ఓపెన్ అవుతుందని చెప్పారు. apobmms వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.పుష్పలత, ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయప్రకాష్, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్‌ఎస్.వేణుగోపాల్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి, ఎల్‌డిఎం ఎ.నాగేంద్ర ప్రసాద్, డివైఆర్‌హెచ్ ఎం.వెంకన్న బాబు, అగ్రికల్చర్ ఎఇ టెక్నికల్ రమేష్ నాయుడు, బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

దళితుల భూములకు సాగునీరివ్వండి
కవిటంలో కౌలురైతుల ఆందోళన

ప్రజాశక్తి - పోడూరు

పట్టిగంపల వోల్డ్ నెంబర్-2 కాలువపై కవిటంలోని కోటిపుంత గరువు ప్రాంతంలో నీరులేక ఎండుతున్న పంట పొలాలకు తక్షణమే సాగునీరివ్వాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఎండుతున్న పొలాలకు తక్షణం సాగునీరందించాలని కౌలు రైతులు సంఘం ఆధ్వర్యాన మంగళవారం పొలాల్లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ కోటిపుంత, గరువు ప్రాంతంలో సాగునీరు లేక పొట్టదశలో ఉన్న పంట ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములు శివారున ఉండటంతో అధికారులు ముందుగా వంతు కట్టారని, ఈ ప్రాంతంలో వ్యవసాయం దళిత కౌలురైతులు చేస్తున్నారని తెలిపారు. గ్రామంలోని కొంతమంది భూస్వాములు వీరి పంట పొలాలకు సాగునీరు పూర్తిగా అందకుండానే స్థానిక ఇరిగేషన్ అధికారులను వంతు పైకి ఇచ్చేయాలంటూ మభ్య పెడుతున్నారన్నారు. సాగునీటి సమస్యపై సంబంధిత అధికారులతో కౌలురైతుల సంఘం నాయకులు, కౌలురైతులు మాట్లాడుతుండగా సదరు భూస్వామి వచ్చి 'మీరు నాయకులను ఎందుకు తీసుకొచ్చారు, కాలువ మాది.. నీకు పనేంటీ.. నన్ను కాదని నీరెలా కడతారో చూస్తాను అని స్థానిక అధికారి పట్ల సైతం దురుసుగా మాట్లాడారన్నారు. తక్షణం భూస్వాముల నుండి రక్షణ కల్పించి వెంటనే సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యను ఇరిగేషన్ డిఇ వెంకటనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించి బుధవారం సాయంత్రం నుండి పూర్తిగా నీరందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు బొడ్డపల్లి నాగేశ్వరరావు, బూరాడి శ్రీను, ఇంజేటి శేఖర్, కోట ఠాగూర్, మహంతి రామకష్ణ, ఉండ్రు రంగారావు, బుడితి లోకేష్, నక్కా శ్యామ్, సుందరం, చెల్లిం నర్సింహమూర్తి, చింతపల్లి సోమేశ్వరరావు, సరెళ్ల ఇజ్రాయేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న కౌలు రైతులు

అంతా మట్టే..!
మట్టి ట్రాక్టర్ల పరుగులతో మట్టి రోడ్డయిన తారు రోడ్డు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - వీరవాసరం

మట్టి రవాణతో ఆర్‌అండ్‌బి రోడ్డు ఛిద్రమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటే అతిశయోక్తి కాదు. వీరవాసరం-పెనుమంట్ర ఆర్‌అండ్‌బి రోడ్డు పంజావేమవరం వద్ద మట్టితో నిండిపోయింది. కొద్ది రోజులుగా ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ పట్టించుకున్న అధికారి లేరు. కొద్ది రోజులుగా పంజావేమవరం వద్ద రోడ్డు పక్కన ఒక చేనును మట్టితో మెరక చేస్తున్నారు. రాత్రి వేళల్లో మాత్రమే ఇక్కడ మట్టి పూడిక చేయడంతో తెల్లారేసరికి రోడ్డంతా మట్టి పేరుకుపోతుంది. మట్టి పూడిక పనులు ప్రారంభించిన నాటి నుండి అంతకంతకు రోడ్డుపై మట్టి పేరుకుపోవడంతో ఇటుగా పయనిస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఉన్నది తారు రోడ్డా.. మట్టి రోడ్డా అనే అనుమానం వచ్చేలా రోడ్డుపై మట్టి పేరుకుపోయింది. కనీసం వాహనదారులను దృష్టిలో పెట్టుకునైనా రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని సంబంధిత వ్యక్తులు తొలగించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిస్తారో, లేదో వేచి చూడాలి.

మట్టితో నిండిపోయిన వీరవాసరం - పెనుమంట్ర ఆర్‌అండ్‌బి రోడ్డు

లింగ నిర్ధారణపై వాణిజ్య ప్రకటనలిస్తే చర్యలు
జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి భానునాయక్

ప్రజాశక్తి - భీమవరం

లింగ నిర్ధారణపై వాణిజ్య ప్రకటనలు ఇస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.భానునాయక్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు ప్రోత్సహించేలా వాల్‌పోస్టర్లు, హోర్డింగులు, వాణిజ్య ప్రకటనలు చేసినా పిసిపిఎన్‌డిటి చట్టం 1994, నిబంధనలు, 1996 కింద స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు మొదటిసారి అతిక్రమిస్తే 3 నుండి ఐదేళ్ల జైలు, రూ.50 వేల నుండి రూ.లక్ష వరకూ జరిమానాతోపాటు భారత వైద్య మండలిలో వైద్య ధ్రువీకరణ పత్రం ఐదేళ్ల వరకూ తొలగిస్తారని, లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానాతోపాటు భారత వైద్య మండలి వైద్య ధ్రువీకరణపత్రం శాశ్వతంగా తొలగిస్తారని తెలిపారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేయాలని కోరినా, ప్రోత్సహించినా చర్యలుంటాయని హెచ్చరించారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి
కలెక్టర్, ఐసిడిఎస్ పీడీలకు అంగన్వాడీ యూనియన్ వినతి

ప్రజాశక్తి - భీమవరం

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఐసిడిఎస్ పీడీ సుజాతరాణికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసిన సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు వేతనాలు పెంచాలన్నారు. సంక్షేమ పథకాలు, గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. మినీ సెంటర్లన్నీ మెయిన్ సెంటర్లుగా మార్చాలనే జిఒలను వెంటనే ఇవ్వాలన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 10వ తేదీన విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీలు 42 రోజులు తమ సమస్యలపై పోరాటం చేశారని, ఆ సందర్భంగా అప్పుడు ప్రతిపక్షంలో, ఇప్పుడు అధికారంలో ఉన్న టిడిపి, జనసేన నేతలు కూడా వచ్చి మద్దతు తెలియజేశారని గుర్తు చేశారు. అంతేకాకుండా తాము అధికారంలోకి వస్తే హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పారనాన్నరు. మినిట్స్ కాపీ ఆధారంగా జులై నెలలో అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని చెప్పారని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చి నెలలు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. 2019 నుంచి అంగన్వాడీలకు ఒక పైసా కూడా జీతాలు పెరగలేదని, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని చెప్పారు. అంగన్వాడీ సమస్యలను బడ్జెట్ సమావేశాల సందర్భంగా చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఉషారాణి, కానూరు తులసి ఉన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

డిమాండ్లు పరిష్కరించాలని ఆశాల వినతులు

మొగల్తూరులో మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి - నరసాపురం

ఆశాల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నామని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.త్రిమూర్తులు తెలిపారు. స్థానిక మూడో వార్డులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా డాక్టర్ మోహన్ లక్ష్మీ ప్రసన్నకు సిఐటియు ఆధ్వర్యంలో ఆశాలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆశాల సమస్యల పరిష్కారంపై రాతపూర్వకమైన మినిట్స్ ఇచ్చారన్నారు. దీని అమలుపై ఆశాలు నూతన ప్రభుత్వం, అధికారులతో పలు దఫాలుగా వినతిపత్రాలు అందజేసినా మినిట్స్ ఆధారంగా జిఒల జారీలోనే తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. తక్షణం వాటి అమలు కోసం ధర్నాకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఆశాలు ఎస్.లక్ష్మి, ఎస్.అమరావతి, ఎస్.కమల, ఎం.సువర్ణ, డి.రాజేశ్వరి, బి.ఝాన్సీ, ఎం.దేవి, సుబ్బలక్ష్మి, ఐ.పెద్దిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు వినతిపత్రాన్ని ఎల్‌బిచర్ల పిహెచ్‌సి హెచ్‌వి కె.ధనలక్ష్మికి అందజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కాళ్ల: ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6న విజయవాడలో మహాధర్నాను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ మండల నేతలు కోరారు. ఆ రోజు సెలవు ఇవ్వాలని కోరుతూ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం మంగళవారం అందజేశారు. అనంతరం ఆశా వర్కర్స్ సమావేశం జరిగింది. మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా పైడి తల్లి, ప్రధాన కార్యదర్శిగా అనిత, ఉపాధ్యక్షులుగా కష్ణవేణి, సహాయ కార్యదర్శిగా దేవకుమారి, కార్యవర్గసభ్యులు ఎన్నికయ్యారు.

మొగల్తూరు : ఈ నెల 6న విజయవాడలో తలపెట్టిన మహాధర్నాకు ఆశా వర్కర్లు తరలిరావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మొగల్తూరులోని పిహెచ్‌సి ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పిహెచ్‌సి వైద్యులు దినేష్‌కుమార్‌కు అందించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెనుగొండ : ఆశాలకు కనీస వేతనం అమలు చేయాలని, ఒప్పంద జిఒలు అమలు చేయాలని కోరుతూ చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు పిలుపునిచ్చింది. మంగళవారం సిద్ధాంతం పిహెచ్‌సి వద్ద మెడికల్ ఆఫీసర్‌కు ఆశాలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు కంకిపాటి లక్ష్మీకుమారి, మామిడి శెట్టి వెంకటలక్ష్మి, దొమ్మేటి దుర్గ, తప్పెట్ల గౌరమ్మ, వెన్నపు రాజేశ్వరి పాల్గొన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన
పూడకతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, శానిటరీ, సచివాలయ సిబ్బందితో కలిసి మంగళవారం పర్యటించారు. పలు వార్డుల్లో డ్రెయినేజీ వ్యవస్థ పూడుకతీసే పనులను పరిశీలించారు. ఇంటింటికీ చెత్త సేకరణకు వస్తున్నారా, ఇతర ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పంజాసెంటర్, గోదావరి సమీప వీధుల్లోని డ్రెయినేజీల పరిశుభ్రతను పరిశీలించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, శానిటరీ మేస్త్రీ కిషోర్, నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల్లో మహిళలు పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.ప్రియాంక అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక పిహెచ్‌సి వద్ద స్థానిక మహిళలకు పరిశుభ్రత, యోగా, సమతుల ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో పిప్పర అంగన్వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్ దుర్గాభవాని, పిహెచ్ ఎన్.అన్నకుమారి, ఎంపిహెచ్‌ఎ అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పాస్టర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

ఎపిసిపిఎ సంస్థను స్థాపించింది దైవజనులకు అండగా ఉండేందుకు అని ఎపిసిపిఎ వ్యవస్థాపకులు పాస్టర్ ఎండి.ఇస్రాయేల్ అన్నారు. జొంథాపేట గ్రామంలో బేతేలు బేతెస్త ప్రార్థనా మందిరంలో పులపల్లి పంచాయతీకి చెందిన పాస్టర్ బాబు ప్రసాద్ కుటుంబానికి ఎపిసిపిఎ ఆర్గనైజేషన్ మంగళవారం ఆర్థిక సహాయం అందజేసింది. పాస్టర్‌బాబు ప్రసాద్ గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు. ఆయన పిల్లల పోషణార్థం రూ.72 వేలు ఆర్గనైజేషన్ రాష్ట్ర నాయకులు ఇస్రాయేల్, వర్మ హాస్పిటల్ ఇన్‌ఛార్జ్ రవి చేతుల మీదుగా అందజేశారు. ఎపిసిపిఎ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పాస్టర్లకు వర్మ హాస్పిటల్స్ వారి హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ కృష్ణ, నియోజకవర్గ ప్రెసిడెంట్ పిహెచ్ కుమార్, ఉండి మండల ఇన్‌ఛార్జ్ జోసెఫ్, కాళ్ల మండల ప్రెసిడెంట్ పురుషోత్తం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆటో, మోటార్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆటో అండ్ మోటార్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హౌసింగ్ బోర్డ్ సెంటర్ ఎస్‌వి.రంగారావు విగ్రహం వద్ద మినీ ట్రక్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) ఆధ్వర్యాన ఆటో కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి ఏరియా కార్యదర్శి మండపర్తి హరీష్ మాట్లాడుతూ మితిమీరిన చలానాలతో డ్రైవర్లను వేధిస్తున్న జిఒ 2131ను చేయాలని, వాహన మిత్రకు 15 వేల రూపాయలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఎస్‌ఆర్ 124(ఇ) నోటిఫికేషన్, 894 నోటిఫికేషన్, డ్రైవర్లకు ఉపాధి లేకుండా చేసే 2023 నూతన మోటారు యాక్ట్ చట్టం 106(1)(2)ను రద్దు చేయాలని కోరారు. డ్రైవర్ల పిల్లలకు విద్యా కానుక వెంటనే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవై ఆసుపత్రి యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.లక్ష్మీనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాస, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.ఆదినారాయణ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

పశువులను గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి జి.నిర్మల సూచించారు. జాతీయ పశు వ్యాధి నివారణ పథకంలో భాగంగా మంగళవారం మండలంలోని కొత్తపాలెంలో పశు వైద్య శిబిరం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా 182 పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత : అంగర

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతాంగం మేలు కోరుతుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యతిస్తూ పాలన అందిస్తున్నారని మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ అన్నారు. తిల్లపూడి గ్రామంలో రూ.16 లక్షలతో రాపాక పంట కాలువ ప్రక్షాళన పనులను సాగునీటి సంఘ ప్రతినిధులు, కూటమి నాయకులతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగర మాట్లాడుతూ చంద్రబాబు ఎనిమిది నెలల పాలనలోనే అభివృద్ధి పథకాలు జోరు గుర్రాలుగా పరుగు పెడుతున్నాయన్నారు. మంత్రి రామానాయుడు నియోజకవర్గ అభివృద్ధితోపాటు, రైతుల సమస్యలను తీర్చేలా పని చేస్తున్నారని తెలిపారు. ఇరిగేషన్ పనులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు అంగర చెప్పారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులు పెనుమత్స రాంబ్రహ్మ రాజు, డిసి ఉపాధ్యక్షులు రామకోటి, మర్తేరు డిసి అధ్యక్షులు ఇంటి శ్రీరాములు, వెలివెల డిసి అధ్యక్షులు పి.రాఘవులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మున్సిపాల్టీలో ప్లాస్టిక్‌ను నిషేధం జరిగేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అధికారులను సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వ్యాపారులతోపాటు హోల్‌సేల్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని వల్ల వచ్చే అనర్థాల గురించి ప్రజలకు, షాపుల యజమానులకు అవగాహన కల్పించాలని అన్నారు.

రూట్స్‌లో ఫ్రూట్స్, వెజిటబుల్స్ క్వారింగ్

ప్రజాశక్తి - తణుకు

రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్‌లో మంగళవారం ఫ్రూట్స్, వెజిటబుల్స్ కార్వింగ్ ఘనంగా నిర్వహించినట్లు సంస్థ ప్రిన్సిపల్ ఎల్.త్రిపాఠి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రూట్స్, వెజిటబుల్స్ కార్వింగ్ కాంపిటేషన్ విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు చాలా ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఫ్రూట్స్, వెజిటబుల్స్‌తో రకరకాలైన ఫ్లవర్ బొకే, జూసాల్స్, బీచ్, జంతువుల నమూనాలు, స్మైలింగ్ బార్బీడాల్, నెమలి పలు కార్వింగ్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని అలరించిన తల్లిదండ్రులకు రూట్స్ యాజమాన్యం మొక్కలు అందజేసి సత్కరించారు. విజేతలైన తల్లిదండ్రులకు రూట్స్ డైరెక్టర్ విద్యాకాంత్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఎన్.సుధాకర్‌వర్మ, ప్రయిమరీ ప్రిన్సిపల్ టి.సంధ్య, పి.త్రిపాఠి, ఎన్.నర్మదా, డి.పద్మజ, వి.మాణిక్యమారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

వీరవాసరం:అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా వీరవాసరంలో మంగళవారం పోషకాహారంపై మహిళల్లో అవగాహనా కార్యక్రమాన్ని ఐసిడిఎస్ అంగన్వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనం మరియు వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో బాల్యవివాహ నిరోధక చట్టం, బాలిక విద్యపై అవగాహన కల్పించారు. మార్చి ఒకటో తేదీ నుండి ఎనిమిదో తేదీ వరకూ ఈ వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు.కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ సూపర్‌వైజర్ పివిపిఎల్.సరోజిని, వీరవాసరం అంగన్వాడీ టీచర్లు నాగరత్నం, శాంతికుమారి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం:స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్, వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వాసవి క్లబ్ సేవా నాయకులు బొలిశెట్టి రాజేష్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్ చేస్తున్న సేవలను అభినందించారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. శిబిరంలో ఈసిజి, షుగర్ పలు పరీక్షలను ప్రజలకు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య ఎమర్జెన్సీ వ్యవస్థాపకులు సోమేశ్వరరావు, వాసవి క్లబ్ అధ్యక్షులు పసుమర్తి అనిల్ ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు కొఠారు హరినాథ్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాము కార్యదర్శి ఉన్న సుందరం పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 1143 మంది హాజరు

పెనుగొండ:ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు గాను మంగళవారం ఇంగ్లీష్ పరీక్షకు 1143 మంది విద్యార్థులు హాజరయ్యారు. 81 మంది గైర్హాజరయ్యారు. ఎస్‌విబి అండ్ పివి జూనియర్ కళాశాల, వాసవి మహిళా కళాశాల విశ్వతేజ జూనియర్ కళాశాల్లో పరీక్షలు జరిగాయి.

ఉండి:మండలంలోని యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో 248 మంది విద్యార్థులకు 244 మంది విద్యార్థులు హాజరయ్యారని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ ఎన్.రమాప్రియ తెలిపారు. నలుగురు విద్యార్థులు గైర్హాజర్యయారని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 83339 88814

ఎన్నాళ్లు.. ఇంకా ఎన్నేళ్లు..!

కేశవరం వంతెన కూలి 18 ఏళ్లయినా పట్టని వైనం - ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - గణపవరం

గుంతలు లేని రహదారులపై దృష్టి పెట్టిన కూటమి ప్రభుత్వం కూలిపోయిన వంతెన నిర్మాణంపై పెట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కేశవరం ఏరియా ప్రాంత ప్రజలు గత 18 ఏళ్లుగా పక్కా వంతెన కోసం ఎదురుచూస్తున్నారు. ఉండి కాలువపై ఉన్న కేశవరం వంతెన కూలిపోయి 18 ఏళ్ల గడిచినా పక్కా వంతెన నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో ఆయా ప్రాంత ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వంతెన కూలిపోయిన తరువాత ప్రజల రాకపోకలకు అనువుగా బెయిలీ వంతెన నిర్మించారు. ఈ వంతెన ఇప్పటికి రెండు పర్యాయాలు శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రజలు వంతెన పైనుంచి రాకపోకలు జరిగే సమయంలో

శిథిలావస్థకు చేరిన కేశవరం బెయిలీ వంతెన

వాహనాలు ఊడిపోయిన రేకుల మధ్యలో పడిపోయి వాహనదారులు గాయాల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు చేపట్టడంతో బెయిలీ వంతెనకు మరమ్మతులు చేశారు. అయితే వంతెన మరలా శిథిలావస్థకు చేరడంతో ప్రజలు మరలా కష్టాలు ఎదుర్కొంటున్నారు. గడిచిన కాలంలో ప్రభుత్వాలు మారినా పక్కా వంతెన నిర్మాణంపై దృష్టి పెట్టడం లేదని సిపిఎం, స్థానికులు విమర్శించారు. పక్కా వంతెన నిర్మాణం కోసం కూటమి నాయకులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కేశవరం, అప్పన్నపేట, జల్లికాకినాడ, మల్లపురాజు పేట, ముప్పర్తిపాడు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రభుత్వం వంతెన నిర్మించాలని సిపిఎం, ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించాలి : వ్యకాస

ప్రజాశక్తి - తణుకు రూరల్

దువ్వలో వ్యవసాయ పనుల్లేక ఉపాధి పనుల కోసం ఎదురు చూస్తున్న కూలీలకు తక్షణం ఉపాధి పనులు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం దువ్వ గ్రామంలో కూలీల ఇంటి వద్దకు వెళ్లి వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వం చేర్పించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ నిరంతరం వ్యవసాయ కూలీల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘంలో కూలీలందరూ సభ్యులుగా చేరాలని కోరారు. ప్రాధాన్యత ఉన్న ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టేందుకు కూలీలు ఐక్యంగా పోరాడి ఉపాధి హామీని పరిరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో దొంగల నాగేశ్వరరావు, బండారు వెంకటేశ్వరరావు, కామన నాగులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సిలో మంగళవారం ఆశాడే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ పి.కిరణ్మయి మాట్లాడుతూ ఆడ పిల్లలకు రక్తహీనత లేకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఒ.జాలాది విల్సన్ బాబు, సూపర్ వైజర్ దుర్గాభవానీ, పద్మజ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పిహెచ్‌సిలో డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో ఆశా డే సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని తెలిపారు. అలాగే ఆహార నియమాలు పాటిస్తూ ఆహారంతో పాటు చిరుధాన్యాలను కూడా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా తయారవుతారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్‌ఎన్ పి.ఎలిజిబెత్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల సమ్మె

డిసిహెచ్‌ఎస్ హామీతో సమ్మె విరమణ

ప్రజాశక్తి - తణుకు

తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలో చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షులు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు మాట్లాడుతూ 5 నెలల వేతన బకాయిలు, 29 నెలల పిఎఫ్ బకాయిలు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. 150 పడకల జిల్లా కేంద్ర ఆసుపత్రి స్థాయికి అనుగుణంగా మరో 50 మంది కార్మికులను అదనంగా నియమించాలని డిమాండ్ చేశారు. సమ్మె శిబిరం వద్దకు విచ్చేసిన ఎపి వైద్య విధాన పరిషత్, జిల్లా డిసిహెచ్‌ఎస్ డాక్టర్ సూర్యనారాయణరాజుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు డి.పుష్పలత,

డిసిహెచ్‌ఎస్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

సిహెచ్ మంగమ్మ, పి.విజయలక్ష్మి, వై.రత్నం, పి.రేణుక, టి.లక్ష్మణరావు, ఎన్.లక్ష్మీ పాల్గొన్నారు.

డిసిహెచ్‌ఎస్ హామీతో సమ్మె విరమణ..

జిల్లా ఎపి వైద్య విధాన పరిషత్ డిసిహెచ్‌ఎస్ డాక్టర్ సూర్యనారాయణరాజు సమక్షంలో కాంట్రాక్టు ప్రతినిధులకు యూనియన్ ప్రతినిధులకు జరిగిన చర్చల ఫలితంగా సమ్మె విరమించి బుధవారం నుంచి కార్మికులు విధులకు హాజరు కానున్నట్లు యూనియన్ అధ్యక్షులు కోనాల భీమారావు తెలిపారు. ఈ చర్చల్లో ఈ నెల 10వ తేదీ నాటికి వేతన బకాయిలు, పిఎఫ్ సొమ్ము కార్మికుల ఖాతాల్లో జమచేయడానికి అంగీకరిస్తూ మినిట్స్ ఇవ్వడానికి అంగీకారం తెలపడం, జిల్లా ఆసుపత్రి స్థాయికనుగుణంగా అవసరమైన పారిశుధ్య కార్మికుల నియామకం త్వరితగతిన చేపడతామని డిసిహెచ్‌ఎస్ ఇచ్చిన హామీతో సమ్మె తాత్కాలికంగా విరమించినట్లు భీమారావు తెలిపారు. ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే ఈనెల 11వ తేదీ నుంచి సమ్మెకు సమాయత్తం అవుతామని స్పష్టం చేసినట్లు భీమారావు తెలిపారు.

మహిళలకు బుక్స్ అందజేస్తున్న సభ్యులు

కుట్టు శిక్షణా మహిళలకు బుక్స్ అందజేత

భీమవరం టౌన్:వెంప గ్రామంలో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ నేర్చుకుంటున్న మహిళలకు వెంప ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వీరవల్లి రమేష్ ఆధ్వర్యంలో ఆయన సోదరులు వీరవల్లి శివ నాగేశ్వరరావు సౌజన్యంతో మహిళలకు మంగళవారం బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుట్టు మిషన్ నేర్చుకుంటున్న మహిళలు మాట్లాడుతూ తాము నేర్చుకుంటున్న కటింగ్స్‌తో పాటు, కొలతలు కూడా ఈ బుక్‌లో రాసుకోవడానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వైద్య రంగంలో 3డి బయోప్రింటింగ్ ఓ సంచలనం

కాన్పూర్ ఐఐటి ఆచార్యులు అశోక్ కుమార్

తాడేపల్లిగూడెం:వైద్య రంగంలో 3డి బయోప్రింటింగ్ ఓ సంచలనంగా మారనుందని కాన్పూర్ ఐఐటి బయో ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. నిట్‌లోని బయో టెక్నాలజీ, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్, నెక్స్ట్ బిగ్ ఇన్నోవేషన్ ల్యాబ్స్ సౌజన్యంతో నెక్స్ట్ జెన్ బైఫాబ్రికేషన్ ఇన్నోవేషన్స్ ఇన్ 3డి బయో ప్రింటింగ్ అండ్ ఫంక్షనల్ బయో మెటీరియల్స్ అనే అంశంపై విద్యార్థులకు ఐదు రోజులపాటు నిర్వహించనున్న సెమినార్ మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అశోక్ కుమార్ ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ 3డి బయో ప్రింటింగ్ సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందని చెప్పారు. శరీరంలో ఏ అవయవమైన దెబ్బతింటే ఆ అవయవాన్ని ప్రయోగశాలలో కృత్రిమంగా తయారుచేయడానికి ఈ సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్ రెడ్డి మాట్లాడుతూ 3డి ప్రింటింగ్ టెక్నాలజీ భవిష్యత్తులో నూతన అధ్యయనానికి నాంది పలకనుందని చెప్పారు. కార్యక్రమంలో ఆచార్యులు శ్రీనివాసన్, రాజేశ్వరరెడ్డి, జగన్మోహనరావు, చక్రవర్తి పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఇ సర్వే తనిఖీ

నరసాపురం:పురపాలక సంఘంలో చేపట్టిన ఎంఎస్‌ఎంఇ సర్వేను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తనిఖీ చేశారు. సర్వేకు సంబంధించి వ్యాపారులు వద్దకు వెళ్లి సర్వేకు సహకరించాలని సూచించారు. పురపాలక సంఘ సిబ్బంది సర్వే నిమిత్తం దుకాణాల వద్దకు వచ్చినప్పుడు యజమాని ఆధార్, పాన్ కార్డు, జిఎస్‌టి, బ్యాంకు ఖాతా నంబర్లు అందించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక రంగానికి సంబంధించిన పలు అంశాలపై చేపట్టి సర్వేను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని ఎంపిడిఒ రామకృష్ణంరాజు సూచించారు. సర్వే ప్రక్రియను సచివాలయాల్లో నమోదు చేస్తున్న వివరాలను ఆయన కొప్పర్రు తదితర గ్రామ సచివాయాల్లో మంగళవారం పరిశీలించారు.సచివాలయ సిబ్బందికి ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

గారడీ బడ్జెట్

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం అంకెల గారిడీ గానే ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ విమర్శించారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆకివీడు ఏరియా సమావేశం డోకల.లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యవక్తగా పాల్గొన్న గోపాలన్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదన్నారు. 18 సంవత్సరాలు దాటినా మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని చంద్రబాబు ఇచ్చిన హామీ బడ్జెట్‌లో ఎక్కడా కనిపించలేదని విమర్శించారు. మద్యం ఏరులై పారేలా బడ్జెట్ లెక్కలు ఉన్నాయన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు ఎండమావిగానే ఉందని, ఇటువంటి బడ్జెట్‌ను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. శివారు ప్రాంతాల్లో పంటలకు సాగు నీరు అందడం లేదని పేర్కొన్నారు. పట్టణంలో చాలా ప్రాంతాలకు తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. తాగునీటి సరఫరా చేసేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవలన్నారు. సమావేశంలో ఏరియా కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడారు. సభ్యులు పెంకి అప్పారావు, డి.రవితేజ, బివి.వర్మ, బి.రాంబాబు, బి.కళ్యాణి పాల్గొన్నారు.

డిఎస్‌పి శ్రీవేదకు రాయల్ మహిళా క్లబ్ ఆహ్వానం

ప్రజాశక్తి - నరసాపురం

రాయల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన జరగనున్న మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని డిఎస్‌పి జి.శ్రీవేదను నిర్వాహకులు ఆహ్వానించారు. మంగళవారం డిఎస్‌పి కార్యాలయంలో రాయల్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో రాయల్ క్లబ్ జాతీయ అధ్యక్షుడు చినమిల్లి సత్యనారాయణరావు, సెక్రటరీ ఆర్‌వి.సుబ్బారావు, మహిళా క్లబ్ అధ్యక్షురాలు వలవల సావిత్రి, సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సిలుగా రాజశేఖరం, రాజా గెలుపుపై హర్షం

ప్రజాశక్తి - తణుకు

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సిగా కూటమి ప్రభుత్వ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంతో పాటు ఉమ్మడి, కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సిగా ఆలపాటి రాజా ఘన విజయం పట్ల తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ అధిక్యంతో వీరి గెలుపు అభివృద్ధికి నాందిగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధికి ఎంఎల్‌సిలు రాజశేఖం, రాజా మరింత కృషి చేస్తారనడంలో సందేహం లేదని అన్నారు. త్వరలో మెగా డిఎస్‌సి ద్వారా సుమారు 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని గుర్తు చేశారు. గెలుపొందిన పేరాబత్తుల రాజశేఖరం, ఆలపాటి రాజాకు ఎంఎల్‌ఎ రాధాకృష్ణ అభినందనలు తెలిపారు.

పాలకొల్లు : గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సిగా కూటమి అభ్యర్థి పేరా బత్తుల రాజశేఖరం విజయం పట్ల మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాజశేఖరానికి శుభాకాంక్షలు తెలిపారు.

CHANGE OF NAME

I, **RAMANATHI VENKATARATNAM S/O VENKATESWARARAO,** age 41 years **Passport No-L7228380,** Door No. 7-131, Kobbarithotapalem, Siddhantam, Penugonda Mandalam, West Godavari District, AP hereby solemnly affirm state on oath as followed I have changed my name from **RAMNATI VENKATARATNAM** (Old Name) **RAMANATHI VENKATARATNAM** (New Name) hence forth I am being called **RAMANATHI VENKATARATNAM, S/O VENKATESWARARAO** for all purpose. my father has changed his name from **RAMNATI VENKATESWARARAO** (Old Name) to **RAMANATHI VENKATESWARARAO (New Name).** Mother has changed his name from **RAMNATI NAGAMANI** (Old Name) to **RAMANATHI NAGAMANI** (New Name) for all purpose.

'ఆక్వా రైతులకు మేలు చేకూర్చాలి'

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రభుత్వం మారినా ఆక్వా రైతులకు ప్రాసెసింగ్ ప్లాంట్లు, సీడ్ ప్లాంట్ల ద్వారా న్యాయం జరగడం లేదని, ప్రభుత్వం రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోకపోతే ఆందోళన బాట పడతామని జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం హెచ్చరించింది. పాలకొల్లు సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు మంగళవారం మీడియాతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గత వారం రోజులుగా రొయ్యల ధరలు తగ్గించి కొంటున్నారని, కనీసం రూ.250 లేనిదే రైతులు తీవ్ర నష్టాల బారిన పడతారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొందరు రైతు సంఘం నేతలతో ఎంపెడా ఛైర్మన్ సమావేశం అయ్యారని, అయితే జిల్లాలో 3 వేల మంది రైతులతో ఉన్న తమ సంఘాన్ని సంప్రదించలేదని చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తి 4 లక్షల టన్నుల నుంచి 9 లక్షల టన్నులకు పెంచాలని కోరారని చెప్పారు. అయితే రైతులు గత కొన్నేళ్లుగా తీవ్ర నష్టాలతో ఉన్నారని, తమ సంఘం కనీస మద్దతు ధర కోసం పోరాడుతుందని చెప్పారు. ఈ వారంలో మరోసారి రైతులతో సమావేశమౌతామని రైతుల సూచన మేరకు అవసరమైతే ప్లాంట్ల వద్ద ధర్నాలు, దీక్షలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సమావేశంలో ఆక్వా రైతు నేతలు బోనం చినబాబు, పెన్మెత్స సత్యనారాయణ రాజు, నక్కా ఫణి, మేడిది జాన్ బాబు, సజ్జా సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయము, తోటపల్లి

టెండరు ప్రకటన

తేది.04-03-2025

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, తోటపల్లి గ్రామపంచాయతీలో కాంట్రాక్టు లేబరు పద్ధతిపై ఈ క్రింది పనులు నిర్వహించుటకు ది. 01-04-2025వ తేదీ నుండి ది. 31-03-2026 వరకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. ఈ టెండర్లు ది. 11-03-2025వ తేదీ ఉదయం గం. 11.30 ని॥లకు తోటపల్లి పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిచే గానీ లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు స్వీకరించబడి, అదేరోజు మధ్యాహ్నం గం. 12.30 ని॥లకు హాజరైన టెండర్లదారుల సమక్షంలో సీల్డు టెండర్లు తెరవబడును. ప్రభుత్వ నిబంధనలకు లోబడి టెండర్లు దాఖలు చేయవలెను. ఇతర వివరముల కొరకు కార్యాలయం పనిచేయు వేళలయందు పంచాయితీ కార్యదర్శిని అడిగి తెలుసుకొనగలరు.

వ.నెం.	పనిపేరు	సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు
1	పారిశుద్ధ్య పనుల నిర్వహణ	1	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-
2	మంచినీటి సరఫరా నిర్వహణ	2	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-
3	ఎలక్ట్రిషియన్	1	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-

నోట్: 1) గతంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2) పంచాయితీ నిధులు, నిల్వలను బట్టి పేమెంట్ చెల్లించబడును. 3) ఎలక్ట్రీషియన్ పని కొరకు దరఖాస్తు చేసుకొన్న వారు సంబంధిత ప్రావీణ్యతా ధ్రువీకరణ పత్రంను సమర్పించవలెను. 4) టెండర్లను స్వీకరించుటకు లేదా తిరస్కరించుటకు పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.

సం/- **బడుగు మమత**
గ్రామపంచాయితీ కార్యదర్శి, తోటపల్లి,
ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా.

సం/- **ఆరేపల్లి శ్రీపద్మ**
సర్పంచ్, తోటపల్లి గ్రామపంచాయితీ,
ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా.

మొగల్తూరులో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని శ్రీనివాస హాస్పిటల్‌లో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించినట్లు శ్రీనివాస హాస్పిటల్ వైద్యులు సి.శ్రీనివాసరాజు తెలిపారు. పాలకొల్లుకు చెందిన రాజవల్లి రాధారమణ్ లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి వచ్చిన సుమారు 50 మందిని పరీక్షించామని తెలిపారు. వారిలో 22 మందికి శాస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారని శ్రీనివాసరాజు తెలిపారు. ఈ శిబిరంలో సీనియర్ ఆప్తమాలజిస్ట్ కె.రెడ్డిబాబి, సిబ్బంది అనంతకుమారి, హారిక, పి.గోపాలకృష్ణ, నిర్మల సేవలందించారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, భీమవరం పట్టణం డోర్ నెం. 15-13-2/3 కాపురస్తులు మాగాపు సత్యవాణి, W/o. మాగాపు ప్రసాద్ అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయింది. **పాస్‌పోర్ట్ నెం. M9807314.** ది. 1-03-2025 తేదీన భీమవరం పట్టణం నందు తాలూక ఆఫీస్ సెంటర్‌కు నా భర్తతో వెళ్ళుచుండగా నా భర్త గారి ఫ్యాంట్ జేబు నందు గల నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మాగాపు సత్యవతి
W/o. మాగాపు ప్రసాద్
డోర్ నెం : 15-13-2/3,
భీమవరం పట్టణం,
భీమవరం మండలం, ప.గో.జిల్లా
సెల్: 99896 67799

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, భీమవరం పట్టణం డోర్ నెం. 15-13-2/3 కాపురస్తులు మాగాపు ప్రసాద్, S/o. మాగాపు వెంకటరాజు అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయింది. **పాస్‌పోర్ట్ నెం. M9807782.** ది. 1-03-2025 తేదీన భీమవరం పట్టణం నందు తాలూక ఆఫీస్ సెంటర్‌కు వెళ్ళుచుండగా నా ఫ్యాంట్ జేబు నందు గల నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మాగాపు ప్రసాద్
S/o. మాగాపు వెంకటరాజు
డోర్ నెం : 15-13-2/3,
భీమవరం పట్టణం,
భీమవరం మండలం, ప.గో.జిల్లా
సెల్: 99896 67799

ప్రకటన

మహారాజశ్రీ ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కం ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం, ప॥గో॥జిల్లా
ఐ.ఏ.నెం. 685/2023 ఇన్ ఓ.ఎస్.నెం. 264/2023

బిట్వీన్ :
శ్రీ కొల్లబత్తుల వెంకట కృష్ణ & 2 అదర్స్ ...పిటీషనర్స్
మరియు
కొల్లబత్తుల నర్సింహ స్వామి & 2 అదర్స్ ...రెస్పాండెంట్స్

సమన్స్ టు :
R-2: కొల్లబత్తుల రాంబాబు S/o. లేట్ ఆనందరావు, పురుషుడు, వయస్సు: 50 సం.రం.లు, ప్రైవేటు జాబ్, పనసదీవి గ్రామం, నరసాపురం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

మీ పై కొల్లబత్తుల వెంకట కృష్ణ & 2 అదర్స్ అను వార్లు ఫైల్ చేసిన పిటిషన్ లో మీరు రెండవ రెస్పాండెంట్ అయియున్నారు. మహారాజశ్రీ ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కం ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం, ప॥గో॥జిల్లా వారు మీకు ఎన్నిసార్లు రిజిస్టర్ పోస్ట్ ద్వారాను, మరియు శ్రీ కోర్టు వారి ద్వారాను నోటీసులు పంపించినప్పటికి పిటిషన్ సమన్సు మీరు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 11-04-2025 సం. తేదీన ఉదయం 10:30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని కోర్టులో హాజరు అయి మీ అక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు పిటిషన్ విచారించబడి, తీర్మానించబడునని మీకు తెలియజేయుచున్నాము.

N. మోహన్‌లాల్
జి.పి. సుదర్శనరావు
పిటీషనర్స్ తరపున అడ్వకేట్స్,
నరసాపురం
నరసాపురం
ది.04-03-25,
సెల్: 92939 47199
సెల్: 99856 49898

ప్రకటన

మహారాజశ్రీ ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కం ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం, ప॥గో॥జిల్లా
ఓ.ఎస్.నెం. 264/2023

బిట్వీన్ :
శ్రీ కొల్లబత్తుల వెంకట కృష్ణ & 2 అదర్స్ ...వాది
మరియు
కొల్లబత్తుల నర్సింహ స్వామి & 2 అదర్స్ ...ప్రతివాదులు

సమన్స్ టు :
D-2: కొల్లబత్తుల రాంబాబు S/o. లేట్ ఆనందరావు, పురుషుడు, వయస్సు: 50 సం.రం.లు, ప్రైవేటు జాబ్, పనసదీవి గ్రామం, నరసాపురం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

మీ పై కొల్లబత్తుల వెంకట కృష్ణ & 2 అదర్స్ అను వార్లు ఫైల్ చేసిన దావా లో మీరు రెండవ ప్రతివాది అయియున్నారు. మహారాజశ్రీ ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కం ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం, ప॥గో॥జిల్లా వారు మీకు ఎన్నిసార్లు రిజిస్టర్ పోస్ట్ ద్వారాను, మరియు శ్రీ కోర్టు వారి ద్వారాను నోటీసులు పంపించినప్పటికి దావా సమన్సు మీరు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 11-04-2025 సం. తేదీన ఉదయం 10:30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని కోర్టులో హాజరు అయి మీ అక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి, తీర్మానించబడునని మీకు తెలియజేయుచున్నాము.

N. మోహన్‌లాల్
జి.పి. సుదర్శనరావు
పిటీషనర్స్ తరపున అడ్వకేట్స్,
నరసాపురం
నరసాపురం
ది.04-03-25,
సెల్: 92939 47199
సెల్: 99856 49898